క్లుప్తంగా

గీత కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



జనగామ రూరల్: గీత పారిశ్రామిక సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో గౌడ ఐక్య సాధన సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గీతకార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయనను కోరారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, జిల్లా అధ్యక్షుడు బూడిద నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు పాముకుంట్ల కృష్ణ, జయదీప్ తదితరులు ఉన్నారు.

ఊరూరా 'కంటి వెలుగు'



బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల అంధత్వ నివారణకు ఊరూరా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తుందని, ఈ శిబిరాలను గ్రామస్తులు వినియోగించుకోవాలని మండలంలోని సాల్వాపూర్ సర్పంచ్ కీసర లక్ష్మి అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీటీసీ గూడెపు లతశ్రీతో కలిసి ప్రారంభించారు. వైద్యులు రమ్య, ఆప్తాల్మిక్ ప్రవీణ్ సిబ్బంది హబీబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన శిబిరాలు

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు శిబిరాలు మండల వ్యాప్తంగా దిగ్విజయంగా ముగిశాయి. మంగళవారం మండలంలోని రంబోజీగూడెంలో చివరి కంటివెలుగు శిబిరం నిర్వహించారు. డాక్టర్ మనోజ్, సూపర్‌వైజర్ యూనస్, హెచ్ఎ రాజశేఖర్, డీఇఓ జావీద్, ఆప్తామాలిస్టు ఝాన్సీరాణి, ఏఎన్ఎంలు భాగ్య, విజయ, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని ఏబీవీపీ వరంగల్ కన్వీనర్ చింతకింది సంతోష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కె.రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్య తీసుకోవాలన్నారు. నాయకులు పొన్నాల రమేష్, మోటికే ఉమేష్, గుంటుపల్లి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు

లింగాలఘణపురం: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకుండా మనోవేదనకు గురి చేస్తూ తన తండ్రి మోరం శ్రీనివాసురెడ్డి ఆత్మహత్యాయత్నానికి కారణమైన కుందారానికి చెందిన మంద ఉపేందర్‌పై మోరం శ్రీధర్‌రెడ్డి మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మోరం శ్రీనివాసురెడ్డి వద్ద 2021లో ఉపేందర్ రూ.8.50 లక్షలు అప్పుగా తీసుకొని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ తనకు ఉన్న ట్రాక్టర్ షోరూమ్‌లో ట్రాక్టర్ ఇచ్చినట్లే ఇచ్చి ట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించలేదని మరోవిధంగా వేధిస్తున్నాడని, అంతేకాకుండా ఉపేందర్ తన అనుచరులతో బెదిరింపులకు పాల్పడుతున్నాడనే ఆవేదనతో ఈ నెల 2న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తన తండ్రి ఆత్మహత్యయత్నానికి కారణమైన వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై మంద ఉపేందర్‌ను ప్రశ్నించగా ట్రాక్టర్ షో రూమ్‌లో పార్ట్‌నర్ షిప్ కోసం డబ్బులు ఇచ్చి నష్టాలు రావడంతో తన డబ్బులు తనకు ఇవ్వాలని డిమాండ్ చేయగా అందుకు కూడా నలుగురు పెద్దల సమక్షంలో అంగీకరించానని తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందింది వాస్తవమేనని విచారణ జరిపి చర్య తీసుకుంటానని చెప్పారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

జనగామ రూరల్: 33 కేవీ విద్యుత్ లైన్ వైర్ తెగిపడి విద్యుదాఘాతానికి గురై గేదెలు మంగళవారం మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని పెద్దరాంచర్లలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్ర బుచ్చిరెడ్డికి చెందిన పాడి గేదెలు రోజు మాదిరిగా పొలంలో గడ్డి మేస్తుండగా కోలనుపాక మీదుగా వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్ వైర్ తెగి పడిపోవడంతో గడ్డి మేస్తున్న గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. విలువైన గేదెలు మృతి చెందాయని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

చెరువుల పండుగకు ఏర్పాట్లు పూర్తి



నర్మెట: సూచనలిస్తున్న ఎంపీడీఓ



బచ్చన్నపేట: పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

నర్మెట/బచ్చన్నపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం (రేపు) నిర్వహించనున్న చెరువుల పండుగకు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎంపీడీఓలు ఎండి ఖాజామొయినుద్దీన్, రఘురామకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని చెరువుల వద్ద పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు విద్యుద్దీపాలంకరణ, కట్టమైసమ్మకు బోనాలు, బతుకమ్మ పండగ, తెప్పోత్సవాలు, సామూహిక భోజనాల ఏర్పాట్లను చేసినట్లు వారు చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సుకేష్, నరేష్, ఎఫ్ఏ ఎల్లయ్య, సర్పంచ్ జాల స్వేతా కిషన్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న నిర్వహించనున్న చెరువుల పండగను విజయవంతం చేయాలని ఎంపీపీ రడపాక సుదర్శన్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చెరువుల పండుగపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ స్వప్న, ఐబీ డీఈ శేషుబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత ఉత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని రామరాయనిబంగ్లాలో బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో సోమవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంగళవారం రాత్రి ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలు దేరారు. గ్రామ కూడలిలోని బొడ్రాయి వద్దకు చేరుకొని అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. పాడి పంటలు చల్లంగా ఉండాలని దేవతను వేడుకున్నారు. బుధవారం దుర్గామాతకు యాటలు బలి ఇవ్వడంతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ బక్క యాదగిరి తెలిపారు. నాలుగు రోజుల పాటు కొనసాగుతున్న ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఏ ఇంట చూసిన బంధువులతో సందడి నెలకొంది.



దుర్గామాతకు పూజ చేస్తున్న భక్తులు

ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం

దేవరుప్పుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం పాటుపడిన అమరవీరుల ఆశయాలను విస్మరిస్తూ కుటుంబపాలన కోసం నిత్యం ఓట్ల రాజకీయం తప్ప ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, దళితులకు మూడు ఎకరాల స్థలంతోపాటు పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన ఉంటుందని సెక్టోరియల్ అధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని గోవర్ధనగిరిలో ఆయన బడిబాట కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆరో రోజు కొనసాగుతున్న బడిబాట వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బడిబాట కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం, కంప్యూటర్ విద్య, ప్రత్యేక తరగతులు, రవాణా భత్యం, డిజిటల్ తరగతులు తదితర సౌకర్యాలు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు. మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి, హెచ్ఎం సంపత్, ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

నర్మెట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని ఎంఈఓ బానోత్ భగవాన్ అన్నారు. మండలంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన ఆయన ఇంటింటి అవగాహనలో పాల్గొన్నారు. ప్రభుత్వం దుస్తులు, పుస్తకాలు ఉచితంగా అందించడంతోపాటు రుచికరమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు సమకూర్చిందన్నారు. తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. పాలెపు విజయ, పాతూరి విజయ, కవిత శ్రీ, మాధవి, స్వరూప, నరేందర్, జానకి, స్వప్న, శామ్యూల్ ఆనంద్ పాల్గొన్నారు.



రఘునాథపల్లి: బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నర్సింహారావు తదితరులు



నర్మెట: బడిబాటలో ఎంఈఓ

సమస్యలు పరిష్కరించాలి

కొడకండ్ల: వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా సెక్యూరిటీగార్డుల సంఘం జిల్లా ఎల్‌వీ రమణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాముకు సెక్యూరిటీ గార్డులు వినతిపత్రం సమర్పించారు. రమణ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులకు మార్కెట్ కమిటీ ద్వారా నేరుగా వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సత్యనారాయణ, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సెక్యూరిటీ గార్డులు

సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించనున్న సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో సాగునీటి దినోత్సవాన్ని గొప్పగా నిర్వహించాలని, గ్రామగ్రామాన చెరువుల పండుగను వేడుకగా జరుపుకోవాలని ఆయన ఆదేశించారు. ఈనెల 7న నియోజకవర్గస్థాయిలో సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండుగను ఘనంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జెడ్పీ స్టాండింగ్‌కమిటీ చైర్మన్ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, సర్పంచ్ సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

నేడు డివిజన్ కేంద్రంలో నిర్వహించనున్న సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సాగునీటి దినోత్సవ వేడుకల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు.

'అంగన్‌వాడీ'ల్లో సామూహిక సీమంతం

జఫర్‌గఢ్: మండలంలోని లక్ష్మీనాయక్‌తండాలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు కలిసి గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలతో పాటు తల్లుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ టీచర్లు ఆర్.కళావతి, జ్యోతి, నర్సమ్మ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: గర్భిణులు, తల్లులు పోషకాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అదేవిధంగా హరితహారం, న్యూట్రిగార్డెన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు ఆకుకూరలు, కూరగాయలు, మొలకెత్తిన గింజలు తదితర అందుబాటులో ఉండే పోషకాహారం తీసుకోవాలని సూచించారు.



జఫర్‌గఢ్: లక్ష్మీనాయక్‌తండాలో..



స్టేషన్‌ఘన్‌పూర్: సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాణి

తాటికొండలో...

మండలంలోని తాటికొండలో ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం, ఐరన్, కాల్షియం ట్యాబ్లెట్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె. ధనలక్ష్మీ, ఆశ వర్కర్ మాధవి పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ స్థల పరిశీలన

దేవరుప్పుల: ఈ నెల 11వ తేదీన చిన్న మడూరు-రంబోజి గూడెం వాగులపై రూ.11 కోట్లతో తలపెట్టిన వంతెన నిర్మాణ స్థలాన్ని ఏఈ శ్రీనివాసారావు మంగళవారం పరిశీలించారు. ఈ వంతెన పనుల భూమిపూజకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రానున్నందున ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పర్యవేక్షించారు. ఈ వంతెన పనులు పూర్తయినట్లయితే ఐదు గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, పల్ల సుందర్ రామిరెడ్డి, బస్వ మల్లేశం, గొడుగు మల్లిఖార్జున్, వంగ వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్ కూతాటీ నర్సింహులు, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం రాజు, వంగ అర్జున్, మల్లేష్, మేడ సోమనర్సయ్య, సోమయ్య పాల్గొన్నారు.



వంతెన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నేటినుంచి బొడ్రాయి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

చిల్పూరు: బుధవారం నుంచి 9వ తేదీ వరకు బొడ్రాయి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి, సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటివ రవీందర్, అర్చకులు చౌదరిమఠం సంతోష్‌శాస్త్రీ తెలిపారు. ఈ మేరకు వారు మండలంలోని లింగంపల్లిలో మంగళవారం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఉప సర్పంచ్ కంకటి రాజన్న, సమ్మక్క-సారలమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్, రవీంద్రచారి పాల్గొన్నారు.

ప్లాట్ల కొనుగోలుపై రాద్ధాంతం చేయొద్దు



పత్రాలు చూపుతున్న కొనుగోలుదారులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కాలనీలో 580, 582 సర్వే నంబర్లలో ప్లాట్లను పూర్తి ఆధారాలతో న్యాయబద్ధంగానే కొనుగోలు చేశామని ఈ ప్లాట్లపై రాద్ధాంతాలు చేయొద్దని పలువురు ప్లాట్ల కొనుగోలు దారులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ సర్వే నంబర్లలో దాదాపు 150 మంది ప్లాట్లు కొనుగోలు చేశామని అలాగే నాలా కనెక్షన్, గ్రామ పంచాయతీ అనుమతులను కూడా తీసుకున్నామని చెప్పారు. ఇటీవల కొందరు సంబంధం లేని వ్యక్తులు కోర్టులో ఇంజంక్షన్ ఆర్డర్ తీసుకొచ్చి భూమి వారిదేనని అధికారులను తప్పుదోవ పట్టించి కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఇళ్ల నిర్మాణాలను చేపడతామని చెప్పారు. బుచ్చయ్య, భాస్కర్, పాండు, రమేష్, భిక్షపతి, చక్రపాణి, బుచ్చిరాజు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

అట్రాసిటి కేసులో పలువురి అరెస్ట్

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్‌లో 174 సర్వే నంబర్‌లో గుడిసెలు వేసిన విషయంలో పలువురిపై కేసులు నమోదు చేసిన విషయంలో కొందరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీల భూముల్లో పలువురు గుడిసెలను వేయడంతో పాటు దుర్భాషలాడినందుకు పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసు విషయంలో పలువురిని అరెస్టు చేసి రిమాండకు తరలించామని మిగిలిన వారిని కూడా రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా

పరామర్శ

చిల్పూరు: చిన్నపెండ్యాల, కొత్తపల్లె గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో కడమంచి పోషాలు, చుక్క లక్ష్మి మృతి చెందారు. కాగా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు నాయకులు బాధిత కుటుంబీకులను మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు సింగపురం ఇమ్మానియేల్, గడ్డమీది సురేష్, ఇల్లందుల యాదగిరి, కోళ్ల రమేష్, బుచ్చయ్య, దుర్గాప్రసాద్, మహేందర్, శోభ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, అనిల్ ఉన్నారు.

సంతాపం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీలర్ గోవిందు సామేల్ మృతిపై పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి ప్రగాఢ సంతాపం తెలిపారు. సామేల్ సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న చిరంజీవి మంగళవారం గ్రామంలో మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామేల్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు.

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మురళి

బచ్చన్నపేట: మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా తేలుకుంటి మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మునిసిని వీరయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తేలుకుంటి శ్రీనివాస్, రెడ్డబోయిన హరికుమార్, సహాయ కార్యదర్శులుగా జంగిలి భిక్షపతి, మల్యాల బాలనర్సయ్య, సందెల సిద్దులు, కోశాధికారిగా గంట తిరుమల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గర్నేపల్లి కరుణాకర్, తాటిచెట్టు భాస్కర్, పంబాల మల్లేషం ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఎన్నిక

చిల్పూరు: తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్‌గా మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన సాదం రమేష్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ లాలపేటలోని విజయడెయిరీ భవనం ముందు పాడి రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిటీలను ప్రకటించారు. డిమాండ్ల పరిష్కారం అయ్యే వరకు నూతన కమిటీలు పోరాటాలు చేస్తాయని అన్నారు.

మీ సేవ కేంద్రం ఉత్తమ నిర్వాహకుడిగా శోభన్‌బాబు



పాలకుర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన ఆధార్ సేవలు అందిస్తున్న తహసిల్దార్ కార్యాలయం మీ సేవ కేంద్రం నిర్వాహకుడు పొన్నాల శోభన్‌కు ఉత్తమ నిర్వాహకుడిగా అవార్డును అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది వేడుకల్లో మంగళవారం పారిశ్రామిక ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మళ్లీ కలుసుకున్నారు. పలు జిల్లాల్లో ఉన్న బాల్య స్నేహితులు మంగళవారం అదే పాఠశాలకు చేరుకొని ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ కరచాలనాలు, అలింగనాలతో పట్టరాని ఆనందంతో గడిపారు. చిన్న నాటి చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవాల్లో మునిగిపోయారు. తమను విద్యా విద్యావంతులుగా తీర్చిదిద్ది ఎదుగుదలకు కారకులైన గురువులు పెండ్లి సత్తిరెడ్డి, ఉపేందర్, శ్రీహరి, బాలమల్లులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు జ్యోతిరాణి, రేణుక, మల్లేష్, అశోక్వేణు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

తరిగొప్పుల: హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల కేంద్రం నుంచి జనగామకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు సమీప పంట పొలాల్లో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైందని, మొక్కలు కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందని స్థానికులు అంటున్నారు. వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని కోరుతున్నారు. వరి కొయ్యలు కాల్చడం వలన కలిగే అనర్థాలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



అగ్నికి ఆహుతైన హరితహారం మొక్కలు